ఎంపిఆర్ డ్యాంను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రెండు నెలల విరామం తర్వాత పాఠశాలు పున:ప్రారంభం కానున్నాయి. గురువారం నాడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో విద్యార్థులు సెలవులకు టాటా చెప్పి బడి బాట పట్టనున్నారు. రెండు నెలలుగా మూగబోయిన పాఠశాలలు నేటి నుంచి సందడి కన్పించనుంది. 2023-24 కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యాశాఖ అధికారులు విద్యార్థులను పాఠశాలలకు ఆహ్వానిస్తున్నారు.

ఇబ్బందుల వెంబడి

- ◆ నేటి నుంచి మోగనున్న బడిగంట
- ◆ సెలవులకు టాటా.. బడి బాట..!
- ◆ పలు పాఠశాలల్లో సమస్యలు స్వాగతం
- ◆ కొత్త ప్రభుత్వంపై ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం,కదిరి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని పాఠశాలల పున:ప్రారంభానికి ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా పాఠశాలల తరగతి గదులనూ సిద్ధం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఓటింగ్ కోసం అధికారులు ఉపయోగించుకున్నారు. పోలింగ్ కోసం ఉపయోగించుకున్న తరగతి గదులను విద్యార్థులకు అనుగుణంగా అధికారులు సిద్ధం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలలకు పంపే ఏర్పాట్లలో నిమగ్నం అయ్యాయి. గడిచిన ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనులు జరిపినా ఇంకా చాలా పాఠశాలల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సమస్య తదితర మౌలిక వసతుల కల్పన పూర్తి స్థాయిలో జరగలేదు. పట్టణ ప్రాంత పాఠశాలల్లో పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నా, గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో సమస్యలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 5200 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 3850, ప్రయివేటు పాఠశాలలు 1350 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో 3.60 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. నేడు పాఠశాలలు తెరవనుండడంతో వీరంతా బడులకు వెళ్లనున్నారు.

కదిరిలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు,

విద్యాకానుక పంపిణీలో జాప్యం

ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు విద్యా కానుక కింద పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం తదితర వాటిని ప్రభుత్వం అందిస్తుంది. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం కొలువదీరింది. కొత్త ప్రభుత్వం వచ్చి ఇంకా రెండు రోజులు మాత్రమే అయ్యింది. ఈనేపథ్యంలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందించడంలో జాప్యం జరిగే అవకాశం కన్పిస్తోంది. ఆయా ప్రాంతాల్లో విద్యాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని వీటిని పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పుస్తకాలు పాఠశాలలకు చేరాయని, వీలైనంత త్వరగా వీటిని విద్యార్థులకు అందిస్తామని విద్యాశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. విద్యాకానుక కిట్లు ఏ మేరకు పాఠశాలలకు చేరాయన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ఉంది. మొత్తం విద్యార్థులకు ఒకే సారి ఇస్తారా.? లేక గతం మాదిరిగానే కొద్దిమంది విద్యార్థులకు అందజేసి, తరువాత ఇంకొందరికి ఇస్తామని చెబుతారా అన్న అన్నది తెలియాల్సి ఉంది. .

ప్రయివేటు ఫీజుల మోత

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోంది. వివిధ సిలబస్‌ల పేరుతో కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఒక విద్యార్థి కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కెజిలో చేర్పించాలంటే పుస్తకాలు, యూనిఫాం, పాఠశాల ఫీజు కలిపి దాదాపు రూ.20 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇక 5 నుంచి 10 వరకు చదివే విద్యార్థులు ఉంటే లక్షల్లోనే ఫీజుల భారం తల్లిదండ్రులపై పడుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజుల నియంత్రణ ఉండాల్సి ఉన్నా, అది ఆచరణలో కన్పించడం లేదు. దీనికి తోడు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో వారి వద్దనే పుస్తకాలు, యూనిఫాం కొనాలన్న నిబంధనతో వాటి మీద కూడా అదనంగా బాదేస్తున్నారు.

అసంపూర్ణంగా నాడు-నేడు పనులు ..!

ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్న నినాదంతో గత వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు పనులను ప్రారంభించింది. వీటి ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగా మూడు విడతలుగా ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేశారు. నిధుల లేమి, ఇతరత్రా సమస్యలతో నాడు-నేడు పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో శిథిల తరగతి గదులు నేటికీ దర్శనమిస్తున్నాయి. పురపాలక కేంద్రాల్లో ఉన్న పాఠశాలల్లో ఒకింత ఈ పనులు జరిగినా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఆ వేగం కన్పించలేదు. ఈ ఏడాది కూడా పాత తరగతి గదిల్లోనే పాఠాలు బోధించే పరిస్థితి చాలా పాఠశాలల్లో కన్పిస్తోంది. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి ఉంది. మరుగుదొడ్లు ఉన్న పాఠశాలల్లో నీటి సమస్య కారణంగా వాటిని ఉపయోగించే స్థితి లేదు. దీంతో పిల్లలు ఆరు బయటకు వెళ్లక తప్పని దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంత పాఠశాలలకు ప్రహరీలు లేవు.

గందరగోళంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు

ప్రభుత్వం మారడంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహణ గందరగోళంగా మారింది. గత ఐదేళ్లుగా వైసిపి నాయకుల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ జరుగుతుండేది. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీల బాధ్యతలను తెలుగుదేశం మద్దతుదారులు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల ఈ వ్యవహారంపై ఘర్షణలు జరుగుతున్నాయి. నేడు పాఠశాలల ప్రారంభం సందర్భంగా పాతవారితోనే మధ్యాహ్న భోజనం చేయించాలా.. లేక ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నేతలు సిఫార్సు చేసిన వారితో మధ్యాహ్న భోజనం తయారు చేయించాలన్న అన్న సందిగ్ధంలో ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ఎంపిఆర్ డ్యాం, కాలువల ఆధునీకరణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

గార్లదిన్నె మండలంలోని ఎంపీఆర్ (మిడ్ పెన్నార్ రిజర్వాయర్) డ్యాంను కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ బుధవారం పరిశీలించారు. డ్యాంలో నీటి నిల్వ, పూర్తిస్థాయి నీటిమట్టం, ఈ సీజన్లో ఎంత నీరు వచ్చే అవకాశం ఉంది.. కాలువల పరిస్థితి, ఆయకట్టు, అతిథి గృహాలు తదితర అన్ని రకాల వివరాలను సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిఆర్ డ్యాం, కాలువల ఆధునీకరణకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలన్నారు. డ్యాం కింద కాలువల పరిశీలనకు అవసరమైన లస్కర్ల కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. డ్యాం గేట్ల మరమ్మతులు చేయించేలా చూడాలన్నారు. టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. డ్యాం పరిధిలో ఉన్న రెండు కాలువల కింద 77 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీఆర్ డ్యాం నుంచి గ్రామాలకు తాగునీటి సరఫరా ఇబ్బంది లేకుండా కొనసాగించాలన్నారు. డ్యాం నుంచి ఎలాంటి లీకేజీలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎల్‌సి ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ వెంకటరమణారెడ్డి, తహశీల్దార్ హనుమాన్ నాయక్, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, సిఐ శ్రీధర్, ఎస్ఐ గౌస్, డిప్యూటీ తహశీల్దార్ విజయకుమార్, వ్యవసాయ అధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

గార్లదిన్నె తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. భూ సమస్యలను తహశీల్దార్, పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హనుమాన్ నాయక్, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, సిఐ శ్రీధర్, ఎస్ఐ గౌస్, డిప్యూటీ తహశీల్దార్ విజయకుమార్, వ్యవసాయ అధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేద్దాం

జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సుభాన్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దామని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఆవరణలో జడ్జి న్యాయవాదులు, కక్షిదారులతో మాట్లాడారు. సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిరక్షరాస్యత, అవగాహన లోపం కారణంగా బాల కార్మికుల జీవితాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు గ్రామాల్లో బాల కార్మికుల తల్లిదండ్రులకు సమాజాభివృద్ధి, కుటుంబాల భవిష్యత్తుపై అవగాహన కల్పించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నా అనుకున్నంత స్థాయిలో ఫలితాలు రావడం లేదని గుర్తు చేశారు. విద్య పట్ల తల్లిదండ్రులకు సరైన అవగాహన లేకపోవడం, చిన్న వయసులోనే పిల్లలను పనులకు పంపుడంతో ఇతర వ్యసనాలకు బానిసలు అవుతున్నారని ఇటీవల పలు సర్వేల్లో తేలిందన్నారు. ఇకనైనా విద్యావంతులు మేల్కొని కార్మికులను పాఠశాలల్లో చేర్పించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దేవేంద్ర, కరణం తిప్పే స్వామి, రామ్మూర్తి, హరి, చక్రవర్తి, దాదాకలంధర్, తులసీనాయక్, ముత్యాలన్న, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు వెలకట్టలేనివి : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు వెలకట్టలేనివని ఎస్పీ గౌతమిసాలి తెలిపారు. నాలుగు దశాబ్దాలు పైబడి జిల్లా పోలీసు శాఖకు సేవలందించి బుధవారం నాడు ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు ఎస్‌ఎ.రహిమాన్ (హెచ్‌జి.నంబర్94)ను ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో పూలమాల వేసి శాలువ కప్పి సత్కరించారు. రహిమాన్ 1983 సంవత్సరంలో హోంగార్డుగా చేరి మంచి సేవలు అందించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు డీఎస్పీ మునిరాజ, ఆర్ఐ మధు, పాల్గొన్నారు.

ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడపాలి : కలెక్టర్

ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

ఏపీఎస్ ఆర్టీసీని అభివద్ధి పథంలో నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులతో బుధవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం నుంచి హైదరాబాద్, బెంగళూరులకు వోల్వో బస్సులను ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలను పంపించాలన్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు స్కిల్ డెవలెప్‌మెంట్ నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాయితీ పాసులపై విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్, డిపిఒ ప్రభాకర్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ ఎహసాన్ బాషా, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం

జూన్ 1 నుంచి 30వ తేదీ వరకూ జరిగే మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా బుధవారం నగరంలోని గిల్డ్ ఆ ఫ్ సర్వీస్ స్కూల్ పక్కన ఉన్న ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల వసతి గృహం, ఎస్సీ, బిసి బాలికల వసతి గృహాలు, రెండు ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాల్లో అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య పర్యవేక్షణలో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయించారు. దోమ కాటు వల్ల వచ్చే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులను అరికట్టడానికి స్ప్రేయింగ్ జరుగుతున్న వసతి గృహాలను జిల్లా మలేరియా అధికారి ఓబులు తనిఖీ చేశారు. ఓబులు వసతి గృహ సంరక్షణ అధికారులతో మాట్లాడుతూ గదుల్లోకి దోమలు రాకుండా మెస్ బిగించుకోవాలని, పిల్లలకు జ్వరాలు వస్తే వెంటనే సమీప ఆసుపత్రులకు పంపించి చికిత్స చేయించాలని సూచించారు. తరచూ వసతి గృహాలను సందర్శించి జ్వరాలు ఉన్నట్లయితే రక్తపూతలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలని వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శి శ్రీదేవిని ఆదేశించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ డెంగీ, మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో లార్వా నివారణ చర్యలు, ఫాగింగ్, దోమల నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ సూపర్వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, వసతి గృహ సంరక్షకులు వసంత, అనిత, నాగార్జునరెడ్డి, ఆశా కార్యకర్త భారతి పాల్గొన్నారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీలు

గుత్తి : నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలోని కర్నూలు రోడ్డులోని శాంతి ప్రియ ఆసుపత్రి నుంచి అనంతపురం రోడ్డులోని రాజీవ్ గాంధీ సర్కిల్ వరకూ రహదారికి ఇరువైపులా ఉన్న మటన్, చికెన్ దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను బుధవారం మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న 5 మటన్, చికెన్ దుకాణాలను అధికారులు మూసేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మూసివేసిన దుకాణాలను యజమానులు 24 గంటల్లోపు పరిశుభ్రంగా ఉంచాలని, లేనిచో దుకాణాలను సీజ్ చేసి భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి దుకాణదారుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని మటన్, చికెన్ విక్రయాలు కొనసాగించాలన్నారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, టిపిబిఒ అప్పుస్వామి, శానిటరీ కార్యదర్శులు దుర్గాప్రసాద్, పి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

కెవికెలో అద్దెకు వ్యవసాయ పనిముట్లు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కృషి విజ్ఞాన కేంద్రంలో ఉన్న వ్యవసాయ పనిముట్లను రైతులకు అద్దెకు ఇవ్వనున్నట్లు కోఆర్డినేటర్ రాధాకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతుల సౌకర్యార్థం కిసాన్ విత్తన గొర్రు, ట్రాక్టర్ స్ప్రేయర్, బాతుకాళ్ల మడక, బెడ్ల గుంటుక, పవర్ విడర్ అద్దెకు ఇస్తున్నట్లు తెలిపారు. విత్తన గొర్రు రోజు అద్దె రూ. 1000, ట్రాక్టర్ స్ప్రేయర్ రూ. 800, బాతుకాళ్ల మడక రూ. 800, బ్లేడ్ గుంటక రూ. 500, పవర్ విడర్ రూ. 500 ప్రకారం అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు తీసుకొచ్చి రూ. 5వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం 89190 99476,90524 43737 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే దగ్గుపాటి

నూతన మంత్రులకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా 4వసారి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ పాల్గొన్నారు. కృష్ణాజిల్లా కేసరపల్లిలోని ఐటీ టవర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో దగ్గుపాటి చంద్రబాబుతో పాటు మంత్రులను కలిశారు. నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ఇతర మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో మంచి రోజులు వచ్చాయన్నారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అదో గతిపాలైందన్నారు. అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ చంద్రబాబు పాలన సాగిస్తారని తెలియజేశారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనతో ఉన్న పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లతో రాష్ట్రానికి మరింత మేలు చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.

చంద్రబాబు నాయుడుతో దగ్గుపాటి ప్రసాద్

రాష్ట్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న పయ్యావుల కేశవ్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్

మంత్రివర్గంలో ముగ్గురు..!

పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్ ప్రమాణస్వీకారం

◆ ముగ్గురికి తొలిసారి అమాత్య యోగం ◆ తొలి విజయంతోనే సవితమ్మ, సత్యకుమార్‌కు ఛాన్స్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకేసారి ముగ్గురికి మంత్రివర్గంలోకి చోటు లభించింది. ముగ్గురూ తొలిసారిగా మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు అనంతపురం జిల్లా నుంచి చోటు లభించగా, సత్యసాయి జిల్లా నుంచి ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్, పెనుకొండ ఎమ్మెల్యే సవితకు మంత్రివర్గంలో స్థానం లభించింది. ఇప్పుడు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న ముగ్గురు కూడా తొలిసారిగా మంత్రులయ్యారు. ఇందులో పయ్యావుల కేశవ్ అనేకమార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఉండగా, సత్యకుమార్, సవితలు తొలిసారిగా ఎమ్మెల్యే అయి ఒకేసారిమంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

మూడు దశాబ్దాల నిరీక్షణ తరువాత మంత్రి

మంత్రి వర్గంలో తొలిసారిగా చోటు దక్కించుకున్న పయ్యావుల కేశవ్ 1994లో రాజకీయరంగ ప్రవేశం చేశారు. ఆ తరువాత 2004, 2009, 2019లో, 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన ఎమ్మెల్యే అయిన ప్రతిసారీ పార్టీ అధికారంలో లేదు. దీంతో మంత్రివర్గంలో చోటు దక్కలేదు. ఈసారి రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతోపాటు, ఎమ్మెల్యేగా కేశవ్ గెలవడంతో మంత్రివర్గంలోకి చోటు దక్కింది.

తొలిసారి ఎమ్మెల్యేతోనే మంత్రివర్గంలోకి..

పెనుకొండ ఎమ్మెల్యేగా సవితమ్మ తొలిసారిగా పోటీ చేసి గెలుపొందారు. ఇప్పుడు మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. సవితమ్మకు రాజకీయ కుటుంబ నేపథ్యం ఉంది. ఆమె తండ్రి రామచంద్రారెడ్డి మాజీ మంత్రిగానూ, ఎంపిగానూ పనిచేశారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక కురుబ కార్పొరేషన్ ఛైర్మన్‌గానూ పనిచేశారు. బిసి మహిళ కోటాలో ఆమెకు ఈ పదవి దక్కింది.

అనూహ్యంగా టిక్కెట్టు సాధించి మంత్రి పదవి

అనంతపురం జిల్లాతో అంత పెద్దగా అనుబంధం లేని సత్యకుమార్ అనూహ్యంగా ధర్మవరం అసెంబ్లీ టిక్కెట్టును బిజెపి తరుపున దక్కించుకున్నారు. అదే విధంగా విజయం కూడా ఊహించని విధంగా దక్కింది. ఇప్పుడు మంత్రి పదవి కూడా అదే రకంగా దక్కడం గమనార్హం. బిజెపిలో అనేక మంది సీనియర్లు గెలుపొందిన వారిలో ఉన్నా సత్యకుమార్‌కు ఈ పదవి దక్కడం చర్చనీయాంశం అయ్యింది.

సీనియర్లకు నిరాశ

ఈసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారిలో అనేక మంది సీనియర్లు ఉన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు గతంలో మంత్రిగా పనిచేశారు. ఆయన ఈసారి రాయదుర్గంలో గెలుపొందారు. మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. కాని తొలి మంత్రివర్గం ఏర్పాటులో నిరాశే మిగిలింది. మాజీ మంత్రి పరిటాల సునీతది అదే పరిస్థితి. మంత్రి పదవి ఈసారి వస్తుందని భావించారు. కాని సత్యసాయి జిల్లాలో సత్యకుమార్, సవితమ్మకు ఇవ్వడంతో వీరికి నిరాశ తప్పలేదు. వైసిపి నుంచి టిడిపిలో చేరి గుంతకల్లులో పోటీ చేసిన జయరాంకు నిరాశే మిగిలింది.

ప్రజాశక్తి
www.prajasakti.com

పాల్యంలో రోడ్లపై మురుగు..

ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని పాల్యం గ్రామంలో రోడ్లపై మురుగునీరు పారుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు పేర్కొం టున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం, స్థానిక సచివాలయం వద్ద డ్రెయినేజీ కాలువలో చెత్త చెదారంతో పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు కదలక రోడ్లపై పారుతుంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, వికలాంగులు ఆ రోడ్డుపై నడవాలంటే ఎక్కడ కింద పడతామో అని భయాందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్యం లోపించి దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ, వంటి విష జ్వరాల బారిన పడుతున్న ట్లు గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే పాల్యం నుంచి పాల్యం తండాకు వెళ్లే దారి ఇరువైపులా ఏపుగా ముళ్ల పొదలు పెరగడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పాల్యం గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడంతో పాటు పాల్యంతండా మార్గంలో ముళ్లపొదలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన నీరు

రోడ్డుకు అడ్డంగా పేరుకుపోయిన ముళ్ల పొదలు

ఉరవకొండలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి శ్రేణులు

కేశవ్‌కు మంత్రి పదవి.. తమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-వజ్రకరూరు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, ఉరవ కొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం ఉరవకొండతో పాటు వజ్రకరూరు, విడపనకల్లులో తెలుగుతమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు. ఉరవకొండ పట్టణంలోని కవితా సర్కిల్ వద్ద టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి స్వీట్లు పంచారు. విడపనకల్లు మండలంలోని గడేకల్ గ్రామంలో టిడిపి శ్రేణులు సంబరాలు చేపట్టారు.

బెళుగుప్ప : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగో సారి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బెళుగుప్పలో బుధవారం తెలుగు తమ్ముళ్లు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకు న్నారు. అంతకుముందు స్థానిక టి సర్కిల్‌లో టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. నాయకులు మాట్లాడుతూ ఉరవకొండ ఎమ్మెల్యేగా మంచి విజయం సాధించడంతో పయ్యావుల కేశవ్‌కు మంత్రివర్గంలోకి చోటు కల్పించినందుకు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కంచిరాముడు, ధనుంజయరెడ్డి, బాలాజీ, శివ, ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, చంద్ర, బి.నారాయణ స్వామి, అంగడి శ్రీరాములు, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు, విపత్తులపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

అగ్ని ప్రమాదాలు, విపత్తులపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో ఉన్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ గోడౌన్‌లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు బుధవారం సహాయ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కెపి.లింగమయ్య ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు, విపత్తులను ఎదుర్కొనే అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా చక్రినాయక్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్‌ఎఫ్ వెంకటేశ్వర్లు, డిఒపి డి.రవికుమార్ నాయక్, ఎఫ్‌ఎంలు కె.శ్రావణ్ కుమార్, బి.మనోహర్, కె.జయరాముడు, హెచ్‌జి డి.శివతేజ పాల్గొన్నారు.

తెలుగుకు వెలుగులు నింపిన కవి 'సినారె'

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

'తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి' మనది అని కీర్తించిన అభ్యుదయ కవి, రచయిత, విమర్శకులు, సినీ గేయ రచయిత, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి, తన సాహిత్యం నిండా మనిషిని కేంద్ర బిందువుగా చేసుకొని రచనలు చేసిన గొప్ప సహృదయ మానవతావాది నారాయణరెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నగరంలోని విశాలాంధ్ర బుక్ హౌస్‌లో పలువురు సాహితీవేత్తలు సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సినారెగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి అత్యున్నత జ్ఞానపీఠ్ పురస్కారం పొందే స్థాయికి ఎదిగిన తీరు పలువురికి ఆదర్శం అని జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య కొనియాడారు. ఎస్కేయు తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర సినారె రచనల గురించి వివరించారు. కార్యక్రమంలో పూజారి ఈరన్న, అనంత సాహితీ ప్రస్థానం అధ్యక్షులు గంగిరెడ్డి, అశ్వర్థరెడ్డి, డాక్టర్ ఉమర్ అలీషా, సాహితీ సమితి జిల్లా అధ్యక్షులు షేక్ రియాజుద్దీన్, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి, ఎస్కేయు తెలుగు శాఖ విద్యార్థులు నిమ్మల వరప్రసాద్, అనిల్, విశాలాంధ్ర బుక్ హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, సాకే గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సి.నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

నీట్ ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఎన్ఎస్‌యుఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-రాయదుర్గం

నీట్ పరీక్షను రద్దు చేసి మరొకసారి నిర్వహించాలని, నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎన్ఎస్‌యుఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యుఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం నియోజకవర్గ అధ్యక్షులు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారున. అనిల్‌కుమార్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ నెల 4వ తేదీ విడుదల చేసిన నీటి పరీక్ష ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం అందులో ఆ ఆరుగురు విద్యా ర్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి సంబంధించిన వారు కావడం అనుమా నాలకు తావిస్తోందన్నారు. వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన 'నీట్' పరీక్షని, ఫలితాలని రద్దు చేసి, మరొకసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే 'నీట్' పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షని రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు డిమాండ్ చేస్తున్నా కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. నీట్ పరీక్ష వల్ల వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నీట్ పరీక్షా ఫలితాలు, పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, లేనిచో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుమ్మగట్ట మండల అధ్యక్షులు జోసఫ్, నాయకులు వీరేష్, పవన్, వినయ్, మనోజ్, హరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

వ్యవసాయంలో మెలకువలపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు

వ్యవసాయంలో మెలకువలపై బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండలంలోని రైతు లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, కెవికె శాస్త్రవేత్త శశికళ, ఎడిఎ శైలజకుమారి, ఎఒ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్-2024 సీజన్‌లో పండించే ప్రధాన పంటలైన వేరుశనగ, ఆముదం, కంది పంటల్లో శాస్త్రీయ, మేలైన యాజమాన్య పద్ధతుల గురించి అనగా మేలైన విత్తన ఎంపిక, విత్తనశుద్ధి, సమగ్ర ఎరువులు, సస్యరక్షణ, తదితర విషయాలను రైతులకు తెలిపారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఖరీఫ్-2023 రాయితీ విత్తన వేరుశనగ, పంట నష్ట పరిహారం మంజూరుపై చర్చించారు. బ్యాంకు సమాచారం పొరపాటు వల్ల మండలంలో 900 మంది రైతులకు పంట నష్ట పరిహారం మంజూరు కాలేదని, ఆయా రైతులు సంబంధిత ఆర్‌బికెల్లో బ్యాంకు ఖాతాకు సంబంధించి సరైన సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ సుచరిత, ఎఇఒలు సుజిత, ప్రసాద్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో మెలకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శివకృష్ణచౌదరిని సన్మానిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

శివకృష్ణచౌదరికి సన్మానం

నార్పల : స్థానిక ప్రాథమిక వైద్యశాలలో బుధవారం శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ శివకృష్ణచౌదరిని వైద్యులు ప్రవీణ్ కుమార్, సాదియా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైద్యులు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఆసుపత్రిలో గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించడంతో పాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. శివకృష్ణచౌదరి మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన తాను ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో తన వంతుగా సహాయ కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. ట్రస్ట్ సేవా కార్యక్రమాలను చూసు కుంటున్న తన స్నేహితులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సేవా నిర్వాహకులు కొండిశెట్టి ప్రవీణ్, బాబాఫకృద్దీన్, పెద్దన్న, వైద్య సిబ్బంది బాలాజీ, అక్కులప్ప, మునిరెడ్డి, అరుణ, అక్షిత, రాజేంద్ర, ఎర్రిస్వామి, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన పోలీసు జీపు

బొమ్మనహాల్ : బొమ్మనహాల్‌లో బుధవారం ఎస్ఐ జీపు మొరాయించింది. ఎస్ఐ పోలీస్ స్టేషన్ నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు బయల్దేరగా సెల్ఫ్ మోటర్ పని చేయక రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఉన్నఫళంగా ఆగిపోయింది. దీంతో డ్రైవర్ స్థానికుల సాయంతో జీపును తోయించినా ఫలితం లేకపోయింది. చేసేదేమీ లేక ఎస్ఐ జీపును అక్కడే వదిలేసి మరో వాహనంలో వెళ్లారు.

ఆగిపోయిన పోలీసుల జీపు

'కిమ్స్'లో న్యూరోసర్జరీ ఐసియు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని కిమ్స్ సవీరా ఆసుపత్రిలో బుధవారం అత్యాధునిక న్యూరోసర్జరీ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియూ)ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వి.కిషోర్‌రెడ్డి, డాక్టర్ పి.శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ అబీబ్‌రాజా పాల్గొన్నారు. సంక్లిష్టమైన న్యూరోసర్జరీలు చేయించుకుని, ఆ తర్వాత కూడా ఇంటెన్సివ్ న్యూరోలాజికల్ పర్యవేక్షణ, చికిత్స అవసరమైన రోగులకు అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించేందుకు వీలుగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలోని కన్సల్టెంట్ న్యూరోసర్జన్లు డాక్టర్ సి.అనిల్, డాక్టర్ మోహన మురళీకష్ణ, క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ సి.రవిశంకర్, డాక్టర్ టి.చంద్ర శేఖర్ మాట్లాడుతూ అత్యాధునిక వైద్యచికిత్సలు అందించడంలో ఇప్పటికే కట్టుబడి ఉన్న మాకు ఇప్పుడు ఈ సరికొత్త న్యూరోసర్జరీ ఐసియును ప్రారంభించడం మరో అద్భుతమైన మైలురాయి అన్నారు. రోగు లకు అత్యున్నత స్థాయి ప్రత్యేక వైద్య చికిత్సలు అందించడం, అందుకు అత్యాధునిక వైద్య పరిజ్ఞానం, నైపుణ్యాలను ఉపయోగించడం ఈ కేంద్రం వల్ల సాధ్యమవుతాయి అన్నారు. న్యూరోసర్జరీ ఐసియు గురించి మరింత సమాచారం, అపాయింట్‌మెంట్ కోసం ఆసుపత్రి వెబ్‌సైట్, కాంటాక్ట్ సమాచారాన్ని సంప్రదించాలన్నారు.

న్యూరోసర్జరీ ఐసియును ప్రారంభిస్తున్న డాక్టర్లు

గేట్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గేట్స్ కళాశాలలో బుధవారం బెంగళూరుకు చెందిన ఇంటెలిప్యాట్ సాఫ్ట్ వేర్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు. జాబ్‌మేళాకు ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల్లో ఆఖరి సంవత్సరం చదువుతున్న పలువురు విద్యార్థులు హాజరయ్యారు. వారిలో రోహిణి చేతన్ బాబు, షీరీన్‌మెహక్ బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్‌లుగా ఎంపికయ్యారని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్మెంట్ అధికారి తన్వీర్ తెలిపారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి రూ. 9 లక్షల ప్యాకేజీతో కూడిన వార్షిక వేతనం కంపెనీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి జి.రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సురయ అభినందించారు.

ఉద్యోగాలకు ఎంపికైన గేట్స్ విద్యార్థులు

డివైడర్ మధ్యలో మొక్క నాటి నీరుపోస్తున్న టిడిపి నాయకులు

మొక్కలు నాటిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నాల్గోసారి సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బుధవారం గుత్తిలో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని గాంధీ కూడలిలో కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టిడిపి నాయకుడు బోర్‌వెల్ నాగరాజు ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం గాంధీ కూడలిలో ఉన్న డివైడర్ల మధ్య మొక్కలు నాటి నీళ్ల పోశారు. గుత్తి ఆర్ఎస్‌లో కొనకొండ్ల సూరి ఆధ్వర్యంలో పత్తికొండ రోడ్డు కూడలిలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి జిల్లా కార్యదర్శి పి.శ్రీకాంత్ చౌదరి ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు న్యాయవాది మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ ఎ.నరసింహులు, ఆదినారాయణ, బాచుపల్లి రంగస్వామి, చిన్న వెంకటస్వామి, రామాంజనేయులు, పూల మాబు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ కందుల కోసం దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : మండలానికి ఖరీఫ్ సీజన్‌కు గానూ 50 క్వింటాళ్ల కందులు (ఎల్ఆర్‌జి-52 రకం) కేటాయించారని ఏవో కాత్యాయని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4 కిలోల కందుల బ్యాగు సబ్సిడీ పోనూ రైతు వాటా రూ. 392 చెల్లించాల్సి ఉంటుంది. విత్తన కందులు కావాల్సిన రైతులు వెంటనే ఆర్‌బికెలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో తెలిపారు.

మంత్రి కేశవ్‌కు 'ఆలం' అభినందనలు

నార్పల : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు అభినందనలు తెలిపారు. ఆలం బుధవారం విజయవాడలో కేశవ్‌ని కలిసి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిం చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

మంత్రి కేశవ్‌ను అభినందిస్తున్న ఆలం నరసానాయుడు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE ::GOOTY
O.S. No. 30/2023

Between:

కె ఫక్రునీసా బేగం మరియు వగైరాలు ....వాదులు

మరియు

గద్వల బాల మద్దయ్య s/o శాంతప్ప,23వ వార్డు కొత్తూరు కాలని, గుత్తి ...ప్రతివాది

ప్రతివాదికి నోటీసు

వాదులు అను వారు ప్రతివాది అను నీ పైన Dealaration of Title and Permanent Injunction కొరకు దావా దాఖలు చేసియున్నారు.సదరి దావా నీ యెక్క హాజరు నిమిత్తం తేది 01/07/2024 నాటికి వాయిదా వేసినారు. ఆ దినము నీవు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరు కావలెను. లేనిచో దావాను నీ పరోక్షమందు తీర్మానించెదరు అని యిందు మూలముగా తేలుపడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

జి .వెంకటరెడ్డి
వాదుల తరపు వకీలు, గుత్తి

సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

జిల్లాలో తమ్ముళ్ల సంబరాలు

ఎన్టీఆర్ విగ్రహాలకు పాలాభిషేకం, నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధినేత చంద్రబాబు నాడు నాల్గవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి కేరింతలు కొట్టారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం అర్బన్ నియోజకవర్గం కేంద్రంలో ఎమ్మెల్యే దగ్గుపాటి సూచనతో టిడిపి నాయకులు నగరంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. భారీ కేక కట్ చేశారు. పసుపు రంగులు చల్లుకుంటూ నత్యాలు చేశారు. చంద్రబాబు ముఖ్యంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని నాయకులు తెలిపారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో అనంత అభివద్ధి బాటలో పయనిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, నాయకులు కష్ణంరాజు, మాజీ నగర అధ్యక్షుడు కృష్ణకుమార్, నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, మాజీ కార్పొరేటర్ రహమత్‌బీ, మణికంఠ బాబు, చేపల హరి, సంగా పవన్, వేలూరు మారుతి నాయుడు పాల్గొన్నారు.

ఆకుల బాబు ఆధ్వర్యంలో ర్యాలీ

నార్పల : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎపి ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బుధవారం నార్పలలో టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్(ఆకుల బాబు) ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సెవెన్ హిల్స్ కల్యాణ మండపం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. ర్యాలీలో బాణసంచా పేలుస్తూ డీజే ముందు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆకుల బాబు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని టిడిపిని అధికారంలోకి తెచ్చిన రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు, మంత్రిగా ప్రమాణం చేసిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి అభినందనలు తెలిపారు. అనంతరం చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవం ప్రత్యక్ష ప్రసారాన్ని అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ర్యాలీకి హాజరైన వారికి కల్యాణ మండపంలో విందు భోజనం ఏర్పాటు చేశారు. ర్యాలీలో నాయకులు ఆకుల సుబ్బరాయుడు, గంజికుంట ప్రభాకర్, నారాయణస్వామి, రాధాకృష్ణ, శ్రీధర్‌బాబు, కమ్మగిరి, శ్రీనివాసులు, నాగభూషణం, పవన్, ప్రదీప్, ఇస్మాయిల్, లోకేష్, కుళ్లాయప్ప, రాజు, జనసేన నాయకులు రామకృష్ణ, పాలగిరి ధనుంజయ్, తుపాకుల భాస్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లప్ప ఆకుల కుటుంబాలు పాల్గొన్నారు.



నార్పల : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆకుల బాబు

పామిడి : సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని స్థానిక రహమత్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించారు. ఉదయం 10 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం వీక్షించేందుకు వీలుగా అవసరమైన ఎల్ఈడి టెలివిజన్ ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపిడిఒ శ్రీనివాసరావు, సిఐ రాజశేఖర్‌రెడ్డి, పామిడి పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, సిబ్బంది ఖాజామొయిద్దీన్, అబ్దుల్ హుస్సేన్, శీన, నాగరాజు, మెప్మా అధికారి చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు బొమ్మనహాల్‌తో పాటు మండలంలోని ఉద్దేహాల్, శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, గోవింద వాడ, తదితర గ్రామాల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. టిడిపి అభిమానులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనమ్మ, ఎస్ఐ శ్రీనివాసులు, వెలుగు పిఒ సురేఖ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పట్టణంలోని 28వ వార్డ్ బళ్లారి రోడ్డులో టిడిపి బిసి సెల్ ఆర్గనైజింగ్ జిల్లా సెక్రటరీ పొరాలు ధనార్జున, కంబ్లి రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రజల మధ్య కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివప్ప, గోవర్ధన్, వార్డ్ ఇన్‌ఛార్జి రవి, వెంకటేశులు, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు

పెద్దవడుగూరు : ఎపి నూతన సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ప్రజలు తిలకించడానికి స్థానిక జెసి కల్యాణ మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పొదుపు మహిళా సంఘాల సభ్యులు, పలు గ్రామాల నుంచి ప్రజలు, మహిళ లు, టిడిపి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు వాహనాల్లో పెద్దసంఖ్యలో తరలివచ్చి ప్రసారాన్ని తిలకించారు. వచ్చిన వారికి ఎంపిడిఒ గోపీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది మిఠాయిలు పంచారు.

పెద్దపప్పూరు : సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మండలంలోని గార్లదిన్నె, పెద్దపప్పూరు, వరదపల్లి, ముచ్చుకోట, అమ్మలదిన్నె, కొట్టాలపల్లి, కమ్మరపల్లి, తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. జై జెసి అంటూ నినాదాలు చేశారు. టిడిపి జెండాలను పట్టుకుని సంబరాలు చేసుకున్నారు.

గుమ్మగట్ట : మండలంలోని జ్యోతిబాపూలే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు చంద్రబాబు సిఎం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. టిడిపి మండల కన్వీనర్ గిరిమల్లప్ప మాట్లాడుతూ చంద్రబాబు నాల్గోసారి సిఎంగా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల హర్షం వ్యకం చేశారు. జగన్ ప్రభుత్వం చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీని సహించలేక ప్రజలు ఏకపక్షంగా కూటమి(టిడిపి, జనసేన, బిజెపి)లకు 164 సీట్లు ఇచ్చి సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. అపారమైన అనుభవం ఉన్న చంద్రబాబు నష్టపోయిన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాట పట్టిస్తారని ప్రజలందరూ ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేశారు. వచ్చిన ప్రజలందరికీ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గౌరీదేవి, ఆర్ఐ చంద్రశేఖర్, సర్పంచి విజయలక్ష్మి సదాశివ, ఎస్సీ సెల్ కార్యదర్శి చిన్ని కిష్టప్ప, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అనంతపురం : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టిడిపి శ్రేణులు

పుట్లూరు : నారా చంద్రబాబు నాయుడు నాల్గోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయ డం, బండారు శ్రావణిశ్రీ శింగనమల ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భాలను పురస్కరించుకుని టిడిపి నాయకులు మండల వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. మండలంలోని చింతకుంట గ్రామంలో వెలసిన భైరవస్వామికి, పెద్దమ్మతల్లికి 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన నాయకులు

శింగనమల : సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణశ్రీ ఆధ్వర్యంలో టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, మాసూల చంద్రమోహన్, టిఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డే నాగభూషణ్, జిల్లా బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, యల్లనూరు మండల కన్వీనర్ దొడ్లో రామాంజనేయులు, చెన్నయ్య, ప్రతాప్, నెట్టికంటి జయరాం వేణు, తదితరులు వెళ్లారు.

రాయదుర్గం: కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు